సాక్షి జనగామ

గురువారం । 15 । ఆగస్టు । 2024

I



మాదక ద్రవ్యాలకు బానిసలు కావొద్దు

మాదక ద్రవ్యాలకు బానిసలై యువత తమ జీవితాలను ఆగం చేసుకోవద్దని పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. - IIలో▸



మక్కలకు రికార్డు ధర

వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో ఈసీజన్‌లో మక్కల(మొక్కజొన్న)కు రికార్డు ధర పలికింది. క్వింటాల్‌కు రూ.2,805 ధర లభించినట్లు అధికారులు తెలిపారు. - IIలో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32°/25°

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి.

న్యూస్‌రీల్

పాలకవర్గాలు నిర్లక్ష్యం విడనాడాలి



దేవరుప్పుల : గ్రామ పంచాయతీ కార్మికులపై పాలకవర్గాల నిర్లక్ష్యవైఖరి విడనాడాలని తెలంగాణ జీపీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకన్న అన్నారు. అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం బుధవారం రాత్రి మండల పరిషత్ కార్యాలయం వద్ద జనజాగరణ జాతర పేరిట నిరసన తెలుపుతూ నిద్రకు ఉపక్రమించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు చెల్లించాలని, మల్టీపర్పస్ విధానం రద్దుతోపాటు అర్హులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. వెంకట్‌రెడ్డి, ఐలయ్య, ఉప్పలయ్య, రమేష్, రామచంద్రు, సోమయ్య, పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

డాగ్ స్క్వాడ్ తనిఖీలు



జనగామ: పంద్రాగస్టు వేడుకలను పురస్కరించుకుని ముందస్తు భద్రత చర్యలు చేపట్టారు. వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్ ఆధ్వర్యాన బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ, కార్గో పార్సిల్ సర్వీస్ కౌంటర్ వద్ద డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. డీసీపీ వెంట ఏసీపీ పార్థసారధి ఉన్నారు.

దేశ భక్తి పెంచడానికే 'హర్ ఘర్ తిరంగా'



జనగామ: ప్రజల్లో దేశ భక్తిని మరింత పెంపొందించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని బీజేపీ మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు అన్నారు. పంద్రాగస్టు వేడుకలను పురస్కరించుకుని పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి ఆధ్వర్యాన బుధవారం జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్కు నుంచి ఆర్టీసీ చౌరస్తా వరకు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు 100 జాతీయ జెండాలను పంపిణీ చేసి సామూహికంగా జాతీయ గీతం ఆలపించారు. పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్రగుప్త, శివరాజు యాదవ్, సౌద రమేష్, పెద్దోజు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.


ప్రైవేట్ పాఠశాలల ఆధ్వర్యాన..

జిల్లా కేంద్రంలో ప్రైవేట్ పాఠశాలల ఆధ్వర్యాన భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. హైదరాబాద్ సంగీత నాట్య కళా అకాడమీకి చెందిన విజయభాస్కర్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంగీత విద్యాంసులు వాయిద్యాలతో దేశ భక్తి గీతాలను ఆలపించారు. ట్రస్మా రాష్ట్ర సమితి సభ్యుడు డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, నక్క సురేష్, ఏకశిల ప్రిన్సిపాల్ చిర్ర ఉపేందర్‌రెడ్డి, న్యూక్రియేషన్ ప్రతినిధి చంద్రశేఖర్, వంశీ, కిరణ్మయి పాల్గొన్నారు. అంతకు ముందు సుభాష్ చంద్రబోస్‌కు నివాళులర్పించారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో నీటి సమస్య పరిష్కరించాలి

జనగామ రూరల్ : చెంపక్‌హిల్స్ ఎంసీహెచ్ ఆస్పత్రిలో నీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే సమస్య పరిష్కరించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అహల్య డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కమిటీ సభ్యులు ఆస్పత్రి వార్డుల్లో సమస్యలపై సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ.. ఎంసీహెచ్‌లో నీటి సమస్య ఎక్కువగా ఉందని, మూడు రోజుల క్రితం రాత్రి 7 గంటల నుంచి ట్యాప్‌ల ద్వారా నీరు రాక మరుగుదొడ్ల నుంచి వెలువడే దుర్వాసనతో గర్భిణులు, అటెండెంట్లు ఇబ్బంది పడ్డారని చెప్పారు. సమస్యలను ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వివరించి పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. చింతల శ్రీలత, గౌసియా, సంపత్, విజయ, నాజియా తదితరులు పాల్గొన్నారు.

విజేత.. జెడ్పీ క్రికెట్ జట్టు



జనగామ: పంద్రాగస్టు వేడుకలను పురస్కరించుకుని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆధ్వర్యాన ధర్మకంచ మినీ స్టేడియంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఆటల పోటీలు ముగిసాయి. చివరి రోజు బుధవారం క్రికెట్ ఫైనల్ పోరులో పోలీసు శాఖ వర్సెస్ జిల్లా పరిషత్ ఉద్యోగుల జట్లు తలపడగా.. జెడ్పీ జట్టు విజేతగా నిలిచింది. జెడ్పీ జూనియర్ అసిస్టెంట్ మేడ మనోజ్‌కుమార్‌కు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డు లభించింది. ఆర్డీఓ కొమురయ్య అభినందించారు.

స్వాతంత్య్ర.. పరిమళాలు

పరిఢవిల్లుతున్న పట్టుగొమ్మలు

- సొంత ఊరిపై పలువురు ఎన్‌ఆర్‌ఐల ప్రేమ..
- దేశసేవలో మన సైనికులు..
- మద్యానికి దూరంగా 'ఎక్కెల'
- గ్రంథాలయాలతో విజ్ఞానాన్ని పంచుతున్న 'లీడ్'

భారతదేశానికి పల్లెలే పట్టుగొమ్మలు.. స్వాతంత్య్ర ఫలాలతో ప్రస్తుతం అవి పరిఢవిల్లుతున్నాయి. తమ పరిధిలోని వనరులను సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి పథాన పయనిస్తున్న గ్రామాలు ఉమ్మడి వరంగల్ జిల్లాలో అనేకం. మద్యం మహమ్మారిని తరిమి ఇతర పల్లెలకు ఆదర్శంగా నిలుస్తోంది మారుమూల ఎక్కెల గిరిజన గ్రామం. మాతృభూమి రుణం తీర్చుకునేందుకు కొందరు ఎన్నారైలు పుట్టిన ఊరికి ఎనలేని సేవలందిస్తున్నారు. గ్రామాభివృద్ధిలో భాగస్వాములవుతున్నారు. మంచిని పెంచుతూ.. జ్ఞానసంపదను పంచుతూ మరో గ్రంథాలయోద్యమం చేస్తున్నారు ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ఇలా సమాజ సేవల్లో పాల్గొంటున్న వారు అనేకం. ఈనేపథ్యంలో నేడు (గురువారం) 78వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని పలు పల్లెల్లో వెల్లివిరుస్తున్న స్వాతంత్య్ర పరిమళాలపై 'సాక్షి' కథనాలు..



రాంపూర్ అభివృద్ధిలో భాగస్వాములై..



ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవంలో స్థానికులతో చర్చిస్తున్న విడియాల సుధాకర్‌రావు (ఫైల్)

- ప్రశంసలు అందుకుంటున్న సుధాకర్‌రావు–గీత దంపతులు

నల్లబెల్లి: పుట్టి పెరిగిన ఊరికి తోడ్పాటు నందిస్తున్నారు వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ విడియాల సుధాకర్‌రావు–గీత దంపతులు. అమెరికాలో స్థిరపడి ఫార్మసీ కంపెనీలో పనిచేస్తున్న వారు గ్రామాభివృద్ధిలో పాలుపంచుకుంటూ స్థానికుల ప్రశంసలు అందుకుంటున్నారు. గ్రామస్తుల కోరిక మేరకు రూ.1.50 కోట్లతో ఫంక్షన్‌హాల్ నిర్మించారు. 33 మంది నిరుపేదలకు రూ.500, ముగ్గురికి రూ.3 వేల చొప్పున ప్రతినెలా పింఛన్ అందిస్తూ అండగా నిలుస్తున్నారు. ఉన్నత పాఠశాల అభివృద్ధి పనుల కోసం రూ.రెండు లక్షలు, మహిళా సంఘాల బలోపేతానికి రూ.ఒక లక్ష, వాటర్ ప్లాంట్‌కు రూ.50 వేలు అందించారు. కరోనా సమయంలో నర్సంపేట ఏరియా ఆస్పత్రికి రూ.30 లక్షలు విరాళం అందించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు రూ.15 వేలు అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. మిషన్ కాకతీయ పనులకు రూ.10 లక్షలు, అలాగే పీజీ చదువుకున్న హైదరాబాద్ ఉస్మానియ యూనివర్సిటీలోని కెమిస్ట్రీ విభాగానికి కోటి రూపాయలు విరాళంగా అందించి ప్రభుత్వ పెద్దల నుంచి ప్రశంసలు పొందారు.

విద్యాపథం.. 'కేసరి'

- విద్యాభివృద్ధికి రూ.కోట్లు ఖర్చు చేస్తున్న ఎన్నారై కేసరి లక్ష్మీనారాయణ





అప్‌గ్రేడ్ చేసిన నేలపోగుల పాఠశాల, (ఇన్‌సెట్‌లో) ఎన్నారై లక్ష్మీనారాయణ

లింగాలఘణపురం: విదేశాల్లో ఉన్నప్పటికీ కన్న ఊరిపై మమకారాన్ని పంచుతున్నారు ఓ ఎన్నారై. విద్యాభివృద్ధి కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారు మండలంలోని నేలపోగుల గ్రామానికి చెందిన కేసరి లక్ష్మీనారాయణ. ఆయన అమెరికా పొల్యూషన్ బోర్డు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో ఉన్నత ఉద్యోగం చేసి విరమణ పొందారు. కుటుంబంతో అక్కడే స్థిరపడినప్పటికీ పుట్టిన ఊరిని బాగు చేయాలనే సంకల్పంతో గ్రామాభివృద్ధికి రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారు. భార్య రత్నమాల స్మారకార్థం 'రత్నమాల కేసరి మెమోరియల్ ట్రస్టు'ను ఏర్పాటు చేసి చైర్మన్‌గా కొనసాగుతూ అభివృద్ధి పనులు చేపడుతున్నారు. 2001లో పాఠశాలకు ఎకరంన్నర భూమిని కొనిచ్చారు. 2006లో రూ.3 లక్షలతో డీఫ్లోరైడ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించారు. రూ.10 లక్షలు ప్రభుత్వానికి చెల్లించి ప్రాథమిక పాఠశాల నుంచి తన భార్య దివంగత కేసరి రత్నమాల పేరుతో ప్రాథమికోన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయించి ఇంగ్లిష్ మీడియానికి మార్పించారు. రూ.కోటితో పాఠశాలలో నూతనంగా రెండంతస్తుల భవనాన్ని నిర్మించారు. అందులో రూ.20 లక్షలతో కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. గ్రామంలో విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న ఎన్‌ఆర్‌ఐ లక్ష్మీనారాయణను స్థానికులు అభినందిస్తున్నారు.

సైనికులు @ కంబాలపల్లి

- పోలీసు, ఆర్మీ ఉద్యోగాల్లో 53 మంది
- ఆదర్శంగా నిలుస్తున్న గ్రామం



కంబాలపల్లి గ్రామం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలం కంబాలపల్లి గ్రామం వీరజవాన్లకు పురుడుపోసింది. ఆర్మీ, పోలీస్, ఎస్‌పీఎఫ్, సీఆర్‌పీఎఫ్ విభాగంలో 28 మంది, ఇతర రక్షణ విభాగాల్లో 25మంది సేవలు అందిస్తున్నారు. గ్రామం నుంచి మొట్ట మొదటిసారిగా మల్లికంటి కృష్ణయ్య సీఆర్‌పీఎఫ్ విభాగంలో ఉద్యోగంలో చేరారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని గ్రామ యువత దేశానికి సేవ చేయాలనే ఉద్దేశంతో పోలీస్, ఆర్మీ ఉద్యోగాల్లో చేరారు. కాగా మల్లికంటి కృష్ణయ్య సుమారు 8 సంవత్సరాలపాటు ఉద్యోగం చేసి అనారోగ్యంతో 1997లో మృతి చెందారు. ఆయన గుర్తుగా కుటుంబ సభ్యులు స్థానిక ఆంజనేయస్వామి గుడికి రూ.18 వేలతో గేటు తయారు చేయించి ఇచ్చారు. అలాగే గ్రామానికి చెందిన మల్లికంటి రమేశ్ ఆర్మీలో 16 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకుని.. గ్రామానికి సేవ చేయాలనే సంకల్పంతో గ్రామంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.


22ఏళ్లుగా ఆర్మీలో విధులు



కంబాలపల్లి గ్రామం నుంచి 22ఏళ్ల క్రితం ఆర్మీలో చేరి విధులు నిర్వరిస్తున్నా. గ్రామానికి చెందిన మల్లికంటి కృష్ణయ్య ఆర్మీలో చేరిన మొదటి వ్యక్తి కాగా.. నేను రెండోవాడిని. ప్రస్తుతం సికింద్రాబాద్ మిలటరీ ఆస్పత్రిలో పనిచేస్తున్న.
– నంద భాస్కర్, జూనియర్ కమాండెంట్ ఆఫీసర్

విద్యా భాండాగారం.. లీడ్ గ్రంథాలయం

- ఎంతోమందిని తీర్చిదిద్దుతున్న కాసుల రవికుమార్



రవికుమార్ ఏర్పాటు చేసిన లీడ్ గ్రంథాలయం

నర్సంపేట: లీడ్ ఫౌండేషన్ ద్వారా ఎంతోమందిని తీర్చిదిద్దుతున్నారు కాసుల రవికుమార్. ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఆదర్శ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయన నర్సంపేటలో స్థిరపడ్డారు. రవికుమార్ లీడ్ ఫౌండేషన్ స్థాపించి 17 ఏళ్లుగా పేద విద్యార్థులకు ఉచితంగా స్పోకెన్ ఇంగ్లిష్, వ్యక్తిత్వ వికాస తరగతులు బోధిస్తున్నారు. తన నివాసంలో 30 వేల పుస్తకాలతో ఏర్పాటు చేసిన లీడ్ గ్రంథాలయం విద్యార్థులకు దిక్సూచిగా మారింది. సతీమణి శోభారాణి సహకారంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 30కి పైగా లీడ్ గ్రామీణ గ్రంథాలయాలు నెలకొల్పారు. సేవా కార్యక్రమాల కోసం రవికుమార్ తన వేతనంలో నుంచి ప్రతినెలా 33 శాతం కేటాయిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

అన్ని గ్రామాల్లో గ్రంథాలయాల ఏర్పాటే లక్ష్యం



ప్రతి గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేయడమే నా ప్రధాన లక్ష్యం. విద్యార్థులకు పుస్తక పఠనంపై మక్కువ పెరిగేలా 'హగ్ ఏ బుక్', ప్రతి ఇంట్లో ఒక గ్రంథాలయం ఉండేలా 'మై హోం మై లైబ్రరీ' చాలెంజ్‌ను అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నా. తల్లిదండ్రులు పిల్లలను పుస్తకాల వైపు మరల్చాలి. – కాసుల రవికుమార్

22 ఏళ్లుగా మద్యపాన నిషేధం



ఎక్కెల గ్రామ ముఖచిత్రం

ఏటూరునాగారం: మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఎక్కెల గ్రామం ఆదర్శంగా నిలుస్తోంది. గ్రామస్తులంతా కలిసికట్టుగా మద్యపానాన్ని నిషేధించారు. మద్యం విక్రయాలు, గుడుంబా తయారీ, కల్లు విక్రయాలు చూద్దామన్నా కనిపించవు. ఎక్కెల గ్రామంలో 300 మంది నివాసం ఉంటున్నారు. 2001లో గ్రామంలో మద్యపాన నిషేధంపై గ్రామస్తులు చేసిన తీర్మానం ఇప్పటికీ అమలవుతోంది. అప్పటి దివంగత మాజీ సర్పంచ్ దుబ్బ కృష్ణమూర్తి సమక్షంలో మహిళలు, పురుషులు, యువకులు అంతా కలిసి కమిటీ ఏర్పాటు చేసుకుని మద్యపాన నిషేధానికి ప్రతినబూనారు. అప్పటి నుంచి గ్రామంలో మద్యం విక్రయాలతో పాటు గుడుంబా తయారీ, కల్లు అమ్మకాలు చేయరాదని గ్రామంలో తీర్మానించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే రూ. 10వేల జరిమానా విధించడం జరుగుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో ఇప్పటికీ ఈ గ్రామం సుభిక్షంగా ఉందంటే అది మద్యపాన నిషేధం మూలంగానే అని గ్రామస్తులు వివరిస్తున్నారు.

సమష్టి తీర్మానం..



2001కి ముందు గ్రామంలో గుడుంబా తయారు చేసేవారు. సారాకు బానిసలై కొంతమంది చనిపోయారు. దీంతో గ్రామస్తులమంతా ఏకమై మద్యపాన నిషేధంపై తీర్మానం చేశాం. ఇప్పటివరకు గ్రామంలో బెల్ట్‌షాపులు లేవు. కల్లు దుకాణాలు లేవు. గుడుంబా తయారీ, విక్రయాలు లేవు. – బాషిక ఐలయ్య, మద్యపాన నిషేధ కమిటీ సభ్యుడు

జెండా పండుగకు ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్, డీసీపీ తదితరులు



ధర్మకంచ మినీ స్టేడియంలో పంద్రాగస్టు వేడుకల ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

- ధర్మకంచ మినీ స్టేడియంలో వేడుకలు
- ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ ఐలయ్య
- కలెక్టర్ ఆధ్వర్యాన పర్యవేక్షణ

జనగామ: స్వాతంత్య్ర వేడుకలను గురువారం జిల్లా కేంద్రం ధర్మకంచ మినీ స్టేడియంలో నిర్వహిస్తున్నారు. కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పర్యవేక్షణలో ఏర్పాట్లు చేపట్టారు. ఉదయం 8.30 గంటలకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ జాతీయ జెండాను ఎగుర వేస్తారు. పోలీసు గౌరవ వందనం స్వీకరించిన తర్వాత ధర్మకంచ స్టేడియంకు చేరుకుంటారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యే ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు స్వాగతం పలుకుతారు. విప్ ఉదయం 9.30 గంటలకు జాతీయ పతాకాన్ని ఎగుర వేసి, 9.35 నుంచి 9.40 మధ్య పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తారు. 9.40 నుంచి 9.50 మధ్య పోలీస్ పరేడ్ కార్యక్రమాన్ని వీక్షిస్తారు. 9.50 నుంచి 10 గంటల వరకు జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రసంగిస్తారు. 10 నుంచి 10.50 వరకు విద్యార్థుల ఆధ్వర్యాన నిర్వహించే కార్యక్రమాలను తిలకిస్తారు. 10.50 నుంచి 11.20 వరకు ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేసిన 250 మందికి ప్రశంసపత్రాలు అందజేస్తారు. 11.20 నుంచి 11.30 వరకు ప్రభుత్వ శాఖల ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శిస్తారు. కాగా జిల్లా పరిషత్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ జాతీయ జెండా ఎగుర వేయనున్నారు. పంద్రాగస్టును పురస్కరించుకుని కలెక్టర్ రిజ్వాన్ బాషా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

భద్రతకు భరోసా..

- మెడికల్ కళాశాలలో నిరంతర నిఘా
- సీసీ కెమెరాల నీడలో వసతి గృహం
- మూడు షిఫ్టుల్లో నలుగురు లేడీ వాచ్‌మన్లు
- అనుమతి లేకుండా బయటకు నిరాకరణ



కళాశాలలో ఎంబీబీఎస్ ఫస్టియర్ విద్యార్థినులు



జనగామ: పశ్చిమ బెంగాల్‌లో వైద్య విద్యార్థినిపై లైంగిక దాడి.. హత్య ఘటన నేపథ్యంలో మెడికల్ కళాశాలలతో పాటు ఇన్‌స్టిట్యూషన్లలో వైద్య విద్యార్థినుల విషయమై కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకోవాలని నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్‌ఎంసీ) ఆదేశించింది. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల, వసతి గృహంలో కల్పించిన భద్రపై ప్రత్యేక కథనం.

జనగామ మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరంలో 100 మంది ఉండగా.. అందులో 72 మంది విద్యార్థినులు, 28 మంది విద్యార్థులున్నారు. చంపక్‌హిల్స్ మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్) పక్కన తాత్కాలిక షెడ్డులో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశారు. విద్యార్థినులకు జిల్లా కేంద్రం ధర్మకంచలోని ఇంటిగ్రేటెడ్ ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో వసతి, చంపక్‌హిల్స్ డీఆర్‌డీఏ భవనంలో హాస్టల్ సౌకర్యం కల్పించారు. రోజువారీగా విద్యార్థినులను ధర్మకంచ నుంచి ప్రత్యేక బస్సులో మెడికల్ కళాశాలకు తీసుకువస్తారు. వారి భద్రత నిమిత్తం వసతి గృహం చుట్టూ కాంపౌండ్ వాల్.. 10 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. హాస్టల్ బయట సెక్యూరిటీ గార్డుతో పాటు నలుగురు లేడీ వాచ్‌మన్లు 24 గంటలు విధుల్లో ఉంటారు. అలాగే వసతి గృహంలో మూడు షిఫ్టుల్లో ప్రొఫెసర్ల పర్యవేక్షణ మధ్య వైద్య విద్యార్థినులకు పూర్తి భరోసా కల్పిస్తున్నారు.

చదువు సాఫీగా సాగుతోంది



ఎంబీబీఎస్ ఫస్టియర్ చదువు సాఫీగా సాగుతోంది. హాస్టల్‌తో పాటు మెడికల్ కళాశాలలో ఎటువంటి ఇబ్బంది లేదు. అంతటా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. తమ బాగోగులను లేడీ ప్రొఫెసర్లు చూసుకుంటున్నారు. నిత్యం పర్యవేక్షిస్తున్నారు.
– సిరి కృతిక, సూర్యాపేట, ఎంబీబీఎస్ ఫస్టియర్

కట్టుదిట్టమైన భద్రత



మెడికల్ కళాశాలలో విద్యార్థినులకు కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తున్నాం. హాస్టల్‌తో పాటు కళాశాల పరిసరాల్లో సీసీ కెమెరాల నిఘా ఉంది. ప్రొఫెసర్లు, స్టాఫ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. ధర్మకంచ వసతి గృహం నుంచి విద్యార్థినులను ప్రత్యేక బస్సులో కళాశాలకు తీసుకువచ్చి, సాయంత్రం తీసుకువెళ్తున్నాం. అందులోకి ఎవరికీ అనుమతి ఉండదు. భద్రతను మరింత పెంచుతాం.
– డాక్టర్ గోపాల్‌రావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

- వీసీలో సీఎస్ శాంతికుమారి

జనగామ: గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర చీఫ్ సెక్రటరీ శాంతికుమారి ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి జ్వరాలు, స్వచ్ఛదనం–పచ్చదనం తదితర కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా ప్రజలు చికెన్ గున్యా, డెంగీ జ్వరాల బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి పెట్టాలని చెప్పారు. గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలు, హాస్టళ్లను సందర్శించి అవసరమైన చోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు తాగునీరు, నాణ్యమైన భోజనం అందుతున్నాయా లేదా పర్యవేక్షించాలని అన్నారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం ఉండేలా చూడాలని, శ్రమదానంతో చెత్త చెదారం తొలగించాలని సూచించారు. వీసీలో అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్, జెడ్పీ సీఈఓ సరిత, డీఆర్డీఓ వసంత, డీఎంహెచ్ఓ రవీందర్‌గౌడ్ డీపీఓ స్వరూప, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు స్కూళ్లలో ఉత్తమ బోధన

బచ్చన్నపేట : ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ బోధన లభిస్తుందని జిల్లా విద్యాధికారి రాము అన్నారు. బుధవారం కేసిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో హెచ్ఎం బి.సుధాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలను దేవాలయాలుగా తీర్చిదిద్దాలని, అందుకు పేరెంట్స్, గ్రామస్తులు సహకరించాలని కోరారు. తమ పిల్లలను తప్పకుండా ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలన్నారు. అంతకు ముందు విద్యార్థులకు స్కూల్ యూనిఫాం అందజేశారు. ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కవిత, ఉపాధ్యాయులు శైలజ, సత్యనారాయణ, భిక్షపతి, యాకూబ్‌రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి

- జూనియర్ డాక్టర్ల ఆందోళన



నిరసనలో పాల్గొన్న జూనియర్ డాక్టర్లు, వైద్యులు

జనగామ: పశ్చిమ బెంగాల్‌లో వైద్య విద్యార్థినిపై లైంగిక దాడి.. హత్యకు పాల్పడిన హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జలగం విజయ్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నుంచి ఆర్టీసీ చౌరస్తా అంబేడ్కర్ విగ్రహం వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు ప్రదర్శిస్తూ హత్యకు నిరసనగా నినాదాలు చేశారు. అనంతరం డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ హంతకులపై చర్యలు తీసుకునే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జ్ డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్లు కరుణాకర్ రాజు, కల్నల్ భిక్షపతి, తేజశ్విని, వంశీ, ఈశ్వర్, మెడికల్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



చెత్తలో నాగేంద్రస్వామి విగ్రహాలు

ఖిలా వరంగల్: కాకతీయులతో పూజలందుకున్న నాగేంద్ర స్వామి వారి విగ్రహాలు 'కుడా' పార్కింగ్ స్థలం వద్ద చెత్తలో నిరుపయోగంగా పడేశారు. ఈ ఘటనపై స్థానికులు మండిపడుతున్నారు. అధికారులు స్పందించి ఆ విగ్రహాలను శిల్పాల ప్రాంగణంలో భద్రపర్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మాదక ద్రవ్యాలకు బానిసలు కావొద్దు

- యువత జీవితాలను ఆగం చేసుకోవద్దు
- రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క, ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్, ఇతర పోలీసు అధికారులు

కొత్తగూడ : మాదక ద్రవ్యాలకు బానిసలై యువత తమ జీవితాలను ఆగం చేసుకోవద్దని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. వారం రోజుల నుంచి మహబూబాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో ఏజెన్సీ యువకుల కోసం నిర్వహిస్తున్న 'మీకోసం.. పోలీసులు' ముగింపు కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా ప్రజాపాలన ఉంటుందన్నారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో గుడుంబా, డ్రగ్స్, గంజాయి నియంత్రణకు పోలీసులు చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు. ప్రతిభ కలిగిన ప్రతీ వ్యక్తికి ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అంతకు ముందు ప్రభుత్వం ముద్రించిన యాంటీ డ్రగ్స్, సైబర్‌క్రైమ్‌కు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. మంత్రి సీతక్కకు సంప్రదాయ గిరిజన వాయిద్యాలతో దింసా నృత్యం చేస్తూ ఘన స్వాగతం పలికారు.

విద్యార్థులతో కలిసి నృత్యం చేసిన మంత్రి, ఎస్పీ

మంత్రి సీతక్క, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్.. ఏకలవ్య గురుకుల విద్యార్థులతోపాటు దింసా నృత్యం చేశారు. అనంతరం వాలీబాల్ ఫైనల్ పోటీలను మంత్రి ప్రారంభించారు. చిత్రలేఖనం, వ్యాస రచన, వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చెన్నయ్య, డీఎస్పీ తిరుపతిరావు, గూడూరు సీఐ బాబూరావు, ఎస్సైలు కుశకుమార్, రవికుమార్ పాల్గొన్నారు.

కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డిపై ఫిర్యాదు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ మల్లారెడ్డి 2007లో గణితశాస్త్ర విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు. ఇంతకాలం తరువాత హనుమకొండకు చెందిన ఓ వ్యక్తి రిజిస్ట్రార్‌గా కొనసాగుతున్న మల్లారెడ్డి అసోసియేట్ ప్రొఫెసర్‌గా నియామకంపై గతనెలలో ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి, ఉన్నత విద్యాశాఖ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. కేయూలో అప్పట్లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా నోటిఫికేషన్ చివరి తేదీ వరకు యూజీసీ నిబంధనల్లో పేర్కొన్నట్లు మల్లారెడ్డికి ఐదేళ్ల విద్యాబోధన, లేదా పరిశోధన అనుభవం లేదని ఆరోపిస్తూ అతడిని ప్రస్తుతం రిజిస్ట్రార్‌గా కొనసాగించొద్దని ఫిర్యాదు చేశారని సమాచారం. విచారణ జరిపి మల్లారెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు సమాచారం. ఈ విషయం కేయూ ఇన్‌చార్జ్ వీసీ వాకాటికరుణ దృష్టికి కూడా వెళ్లినట్లు తెలిసింది.

అసోసియేట్ ప్రొఫెసర్‌కు అర్హుడినే..

కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డిని బుధవారం 'సాక్షి' వివరణ కోరగా తనపై ఒకరు ఇటీవల ఫిర్యాదు చేసినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అందుకు సంబంధించిన వివరాలు తనకు అందాయన్నారు. తాను 2007లో గణితశాస్త్ర విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా నియామకం అయ్యాయని తెలిపారు. ఈ పోస్టుకు తాను అర్హుడినేనన్నారు. ఈ విషయంపై తాను ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణకు వివరణ ఇవ్వబోతున్నానని వివరించారు.

నేడు జేఎల్‌ఎంలకు పదోన్నతులు

హన్మకొండ: విద్యుత్ జూనియర్ లైన్‌మెన్ల పదోన్నతి ప్రక్రియ ఒకే రోజులో ముగించేలా టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఎన్పీడీసీఎల్‌లో అసిస్టెంట్ లైన్‌మెన్ పోస్టులు భారీగా ఖాళీ ఉన్నాయి. జూనియర్ లైన్‌మెన్ పోస్టులు తక్కువ ఉన్నారు. దీంతో అర్హులైన ప్రతి ఒక్కరికీ పదోన్నతి లభించే అవకాశముండడంతో ఒకే రోజులో ప్రక్రియ ముగించాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి.. సంస్థ పరిధిలోని డివిజనల్ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 15న మధ్యాహ్నం వరకు పదోన్నతులు కల్పించి ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు అదే రోజు సాయంత్రం 5 గంటలలోపు పదోన్నతి పొందిన పోస్టులో జాయిన్ కావాలని సూచించారు. ఎలాంటి స్థానం చలనం లేకుండా జేఎల్‌ఎంగా కొనసాగుతున్న స్థానంలోనే ఏఎల్‌ఎంగా నియమించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు డివిజనల్ ఇంజనీర్లు కసరత్తు చేస్తున్నారు.

అధిక ధర ఆశకుపోయి కటకటాలపాలయ్యారు..

- గంజాయి పట్టివేత కేసులో ఏడుగురు నేరస్తులకు ఒక్కొక్కరికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ. 2 లక్షల చొప్పున జరిమానా
- తీర్పు వెలువరించిన మహబూబాబాద్ జిల్లా జడ్జి పి.చంద్రశేఖరప్రసాద్

మహబూబాబాద్ రూరల్: కొందరు వ్యక్తులు అధిక ధర ఆశకుపోయి.. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి కటకటాలపాలయ్యారు. ఛత్తీస్‌గఢ్‌లో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి గూడూరుకు తీసుకొచ్చారు.. ఇక్కడి నుంచి హైదరాబాద్‌లో ఎక్కువ ధరకు విక్రయించడానికి వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అనంతరం కేసు నమోదు చేయగా కోర్టు తీర్పుద్వారా జైలుపాలయ్యారు. కోర్టు డ్యూటీ అధికారులు ఐలబోయిన వెంకటేశ్వర్లు, ధరావత్ రమేశ్ కథనం ప్రకారం.. 2020 ఆగస్టు 4వ తేదీన మహబూబాద్ జిల్లా గూడూరు మండలం దస్రూతండా రాళ్లవాగు ప్రాంతంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో పలువురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించగా వారిని ఆపి తనిఖీ చేయగా 2.20 క్వింటాళ్ల ఎండు గంజాయి (ప్రస్తుతం సుమారు రూ. 50 లక్షలు) లభ్యమైంది. దీంతో అప్పటి ఎస్సై యాసిన్ ఫిర్యాదు మేరకు అప్పటి ఏఎస్సై సాంబయ్య రాళ్ల వాగుకు చెందిన భూక్య లక్ష్మణ్, భూక్య రాము, బోడ సుమన్, భూక్య కుమార్, బోడ రవి, తేజావత్ సురేశ్, బానోత్ రెడ్యాపై కేసు నమోదు చేశారు. అప్పటి సీఐలు బాలాజీ, రాజిరెడ్డి కేసు విచారణ చేపట్టగా సీఐ రాజిరెడ్డి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ పక్షాన జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిలకమారి వెంకటేశ్వర్లు కోర్టులో వాదనలు వినిపించగా డీఎస్పీ తిరుపతిరావు, ప్రస్తుత గూడూరు సీఐ బాబురావు, ఎస్సై గిరిధర్‌రెడ్డి, సీడీఓలు వెంకటేశ్వర్లు, రమేశ్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. వాదనలు విన్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ నేరం నిరూపణ కాబడిన ఏడుగురు వ్యక్తుల్లో ఒక్కొక్కరికి 20 ఏళ్ల చొప్పున కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ. 2 లక్షల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

గుండెపోటుతో రైతు మృతి


లింగన్న (ఫైల్)

చిట్యాల: గుండెపోటుతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని దూద్‌పల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన రైతు పులి లింగన్న (49) మంగళవారం తన వ్యవసాయ పనులు చేసుకుని ఇంటికి వచ్చాడు. రాత్రి భోజనం చేసిన అనంతరం నిద్రించాడు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో తన కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో సమీపంలోని డాక్టర్‌ను తీసుకొచ్చేలోపే లింగన్న మృతి చెందాడు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగారు.

విధుల్లో చేరిన ఇంటర్‌విద్య ఆర్‌జేడీ జయప్రదబాయి

విద్యారణ్యపురి : ఇంటర్ విద్య ఆర్‌జేడీ కార్యాలయం వరంగల్ తరలిస్తూ ఇంటర్‌విద్య డైరెక్టర్ శృతిఓజా ఈనెల 13న ఉత్తర్వులు జారీచేసిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఆర్‌జేడీ జయప్రదబాయి బుధవారం విధుల్లో చేరారు. ఇంటర్‌విద్య ఆర్‌జేడీ కార్యాలయం హనుమకొండలోని ప్రభుత్వ కోఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలలో కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ కళాశాలలో ఏఏ గదులు ఆఫీస్ నిర్వహణకు అనుకూలంగా ఉంటాయొ ఆర్‌జేడీ పరిశీలించినట్లు తెలిసింది. కాగా, డీఐఈఓ ఎ. గోపాల్, ప్రిన్సిపాల్ ధర్మేంద్ర, ఒకేషనల్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీధర్, మరో ప్రిన్సిపాల్ మాధవరావు, ఆయా కళాశాలల అధ్యాపకులు జయప్రదబాయికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్..

- పోలీసుల దాడులు
- రూ.32 లక్షలు స్వాధీనం
- ఇద్దరి అరెస్ట్

హసన్‌పర్తి: ఇంగ్లాండ్‌లో నిర్వహిస్తున్న వంద బాల్స్ మ్యాచ్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న గోపాలపురంలోని ఓ స్థావరంపై టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు.ఈ సందర్భంగా వారి వద్ద నుంచి సుమారు రూ.32 లక్షల (నగదుతో పాటు బ్యాంకు సేవింగ్స్)స్వాధీనం చేసుకున్నారు. మూడు సెల్ ఫోన్, లాప్‌టాప్ సీజ్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. గోపాలపురం వెంకటేశ్వరకాలనీకి చెందిన మాడిశెట్టి ప్రసాద్ తన ఇంటిలో ఇంగ్లాండ్‌లో జరుగుతున్న వంద బంతుల ఫైనల్ మ్యాచ్‌పై బెట్టింగ్ నిర్వహిస్తున్నాడని పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్, కాకతీయ యూనివర్సిటీ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా మాడిశెట్టి ప్రసాద్ (ఆన్‌లైన్ క్రికెట్ బుకీ), మహారాష్ట్రకు చెందిన సునీల్‌తో పాటు మరొకరి సాయంతో www.nice7777.pso అనే యాప్ ద్వారా ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈమేరకు నిందితులను అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఏసీపీ చెప్పారు. ఈదాడుల్లో ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్‌ను సందర్శించిన డైరెక్టర్




వరంగల్: ఏనుమాములోని వరంగల్ మార్కెట్ కమిటీలోని యార్డులను బుధవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకుడు పి.ఉదయ్‌కుమార్ సందర్శించారు. ఈసందర్భంగా ఆయనకు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల, చాంబర్ ప్రతినిధులు, దడవాయి సంఘం నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన పసుపు–పల్లికాయ యార్డును సందర్శించి రైతులతో మాట్లాడారు. మార్కెట్‌లో ఇ–నామ్ ద్వారా జరిగే క్రయ విక్రయాలకు సంబంధించిన వివరాలు లాట్ ఐడీ, వేయిమెంట్ స్లిప్‌లు, తక్‌పట్టీలు పరిశీలించారు. మార్కెట్ పరిధి కోల్డ్ స్టోరేజీలు వసతుల గురించి కార్యదర్శి నిర్మలను, చాంబర్ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల మార్కెటింగ్ అధికారులు జి.అనురాధ, కె.సురేఖ, చాంబర్ ప్రతినిధులు వేద ప్రకాశ్, చింతలపల్లి వీరారావు, అల్లె సంపత్, రాజేశ్ డి.కరాని, కంచె సంపత్, గ్రేడ్–2 సెక్రటరీలు ఎస్.రాము, జి.అంజిత్‌రావు, అకౌంటెంట్ జి.సుకన్య, ఏఎంఎస్ జి.రాజేందర్, వరంగల్ మార్కెట్ కమిటీ సిబ్బంది, రైతులు, దడవాయిల గుమాస్తాలు పాల్గొన్నారు.

అమ్మ పేరుతో మొక్క నాటుదాం

కాజీపేట అర్బన్: ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో ఒక మొక్క నాటి ప్రేమను చాటాలని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ పిలుపునిచ్చారు. నిట్ వరంగల్ క్యాంపస్‌లో బుధవారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకారం చుట్టిన 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమం స్ఫూర్తితో నిట్‌లో ప్లాంటేషన్ డ్రైవ్, ర్యాలీ నిర్వహించారు. నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ ముఖ్య అతిథిగా పాల్గొని అటవీశాఖ సౌజన్యంతో అందజేసిన 200 మొక్కలను నిట్ అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి నాటారు. పర్యావరణ పరిరక్షణకు, క్యాంపస్‌ను గ్రీన్‌గా తీర్చిదిద్దుకునేందుకు నాటి ప్రతీ మొక్కను కాపాడుకుందామని ప్రతిజ్ఞ చేయించారు.

మక్కలకు రికార్డు ధర

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో ఈసీజన్‌లో మక్కలకు రికార్డు ధర పలుకుతోంది. బుధవారం గూడూరు మండలం కమలాపురానికి చెందిన రైతు రమేశ్ తొమ్మిదిన్నర క్వింటాళ్ల బిల్‌టీ రకం మక్కలు తీసుకురాగా క్వింటాల్‌కు రూ.2805 ధర పలి కింది. మక్కలను దుర్గా ట్రేడర్స్ విక్రయించగా వెంకటరమణ ఎంటర్‌ప్రైజెస్ కొనుగోలు చేసింది . మక్కలకు కనిష్టంగా రూ.2205, గరిష్టంగా రూ.2 805 ధర పలికిందని అధికారులు తెలిపారు.



విప్లవ వనిత

మూడేళ్ల కొడుకును పణంగా పెట్టి...

భగత్‌సింగ్‌ను కాపాడిన భాభీ

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌వీర్... వీరంతా ఆమెను 'దుర్గా భాభీ' అని పిలిచేవారు. సాయుధ పోరాటంతోనే బ్రిటిష్ వారిని దేశం నుంచి తరిమికొట్టగలం అని భావించిన దళంలో పిస్తోల్ పట్టిన తొలి విప్లవ వనిత దుర్గావతి దేవి. బ్రిటిష్ అధికారి సాండర్స్‌ను హత్య చేసిన భగత్‌సింగ్‌ను లాహోర్ నుంచి తప్పించేందుకు అతడి భార్య అవతారం ఎత్తిందామె. చరిత్ర పుటలలో కనుమరుగై పోయిన ఆ త్యాగమయి గురించి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా...

'సైమన్ గోబ్యాక్' నిరసన కార్యక్రమం చేస్తున్న లాలా లజపతిరాయ్ మీద బ్రిటిష్ పోలీసుల లాఠీచార్జీ జరిగి ఆయన ప్రాణం పోయింది. పంజాబ్‌లో యువతకు మార్గదర్శిగా ఉన్న ఆ మహా నాయకుణ్ణి కోల్పోయినందుకు 'హిందూస్తాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్' (హెచ్‌ఎస్‌ఆర్‌ఏ) సభ్యులకు ఆగ్రహం వచ్చింది. ఇది స్వాతంత్ర్య సమరయోధుడు భగవతి చరణ్ ఓహ్రా నడుపుతున్న గ్రూప్. చంద్రశేఖర ఆజాద్, భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ తదితరులంతా ఇందులో సభ్యులు. వీరంతా కలిసి లాఠీచార్జిని ఆర్డర్ వేసిన బ్రిటిష్ ఆఫీసర్ స్కాట్‌ను చంపాలనుకున్నారు. నిర్ణయం అమలు పరచడమే తరువాయి.



టెలివిజన్ ఎపిసోడ్‌లో భగత్‌సింగ్, దుర్గా భాభీ

స్కాట్ బదులు సాండర్స్

భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఈ ముగ్గురు 17 డిసెంబర్ 1928న లాహోర్‌లో పోలీస్ ఆఫీసర్ స్కాట్‌ను హతమార్చడానికి సిద్ధమయ్యారు. అయితే బైక్ మీద రావాల్సిన స్కాట్ కారులో, కారులోనూ రావాల్సిన మరో అధికారి సాండర్స్ బైక్ మీద రావడంతో అయోమయం నెలకొంది. అయినా సరే ఎదురుపడిన సాండర్స్‌పై మొదట రాజ్‌గురు, ఆ తర్వాత భగత్ సింగ్ తుపాకీ పేల్చి అతణ్ణి హతమార్చారు. లాహోర్ అంతా గగ్గోలు రేగింది. వందలాది మంది పోలీసులు అన్ని దారులు... బస్టాండ్లు... రైల్వేస్టేషన్లు కమ్ముకున్నారు. లాహోర్‌లో ఉండటం భగత్‌సింగ్‌కు ఏ మాత్రం మంచిది కాదు. అతణ్ణి తప్పించేవారు ఎవరు?

ఆమె వచ్చింది

భగవతి చరణ్ ఓహ్రా సతీమణి దుర్గావతిని అందరూ దుర్గాభాభీ అని పిలిచేవారు. సాండర్స్‌ని హత్య చేశాక భగత్‌సింగ్, రాజ్‌గురు నేరుగా దుర్గావతి దగ్గరకు వచ్చారు. అప్పటికి ఆమె భర్త వేరే పని మీద కలకత్తా వెళ్లి ఉన్నాడు. జరిగింది తెలుసుకున్న దుర్గావతి వెంటనే భగత్‌సింగ్‌ను లాహోర్ దాటించడానికి సిద్ధమైంది. జుట్టు కత్తిరించుకుని హ్యాట్ పెట్టి రూపం మార్చిన భగత్‌సింగ్‌కు ఆమె భార్యగా నటిస్తూ తన మూడేళ్ల కొడుకుతో మరుసటి రోజు సాయంత్రం లాహోర్ నుంచి డెహ్రాడూన్ వెళుతున్న ఎక్స్‌ప్రెస్‌లో మొదటి తరగతి ప్రయాణికురాలిగా బయల్దేరింది. వందలాది నిఘా కళ్ల మీద ఈ పని చేయడం చాలా ప్రమాదం... మూడేళ్ల కొడుక్కు కూడా ఏదైనా కావచ్చు అని భగత్‌సింగ్ ఆమెతో అన్నాడు. 'నా కొడుక్కు మరణం సంభవిస్తే ఒక దేశభక్తునిగా తన ప్రాణం అర్పించే అవకాశం వాడికి దక్కుతుంది' అని చెప్పి ఆమె ముందుకు కదిలింది. భగత్‌సింగ్ ఆధునికవేషంలో ఉన్న అధికారిగా, దుర్గావతి అతని భార్యగా, రాజ్‌గురు నౌకరుగా ఆ ప్రయాణం చేశారు. బ్రిటిష్ వాళ్లకు ఏ మాత్రం అనుమానం రాలేదు. భగత్‌సింగ్‌ను అలా క్షేమంగా కలకత్తా చేర్చి వెనక్కు వచ్చింది దుర్గావతి.

గొప్ప దేశభక్తురాలు

స్వతంత్ర పోరాటం చేస్తున్న భగవతి చరణ్ ఓహ్రాను వివాహం చేసుకునేనాటికి దుర్గావతికి 13 ఏళ్లు. పెళ్లి తర్వాతనే చదువుకుంది. ఇంట్లో ఇరుగు పొరుగు పిల్లలకు పాఠాలు చెప్పేది. సాయుధ పోరాటం చేయాలన్న భర్త ఆశయానికి మద్దతుగా నిలిచిందామె. భగత్‌సింగ్‌ను తన కన్నబిడ్డలా భావించింది. భగత్ సింగ్ పార్లమెంట్‌లో బాంబు దాడి చేసి అరెస్ట్ అయ్యాక ఆ తర్వాతగాని అతడే సాండర్స్ హత్యలో ఉన్నాడన్న సంగతి పోలీసులకు తెలియలేదు. ఆ కేసు వాదనలను బ్రిటిష్ ప్రభుత్వం హడావిడిగా ముగించి అక్టోబర్ 7, 1930న తీర్పు వెలువరించి భగత్‌సింగ్‌కు మరణశిక్ష విధించింది. అయితే లాహోర్‌లో ఈ విచారణ జరుగుతున్నప్పుడు భగత్‌సింగ్‌ను తీసుకెళ్లే వ్యానుపై బాంబుదాడి చేసి అతణ్ణి కాపాడాలని ప్లాన్ చేసింది దుర్గావతి. వీలు కాలేదు.

భర్తను కోల్పోయి

భగత్‌సింగ్‌ను జైలు నుంచి రక్షించడానికి స్వదేశీ జ్ఞానంతో బాంబులు తయారు చేస్తూ ప్రమాదవశాత్తు భగవతి చరణ్ ఓహ్రా మరణించాడు. అంత కష్టాన్ని తట్టుకుని దేశం కోసం పోరాడాలనుకుంది దుర్గావతి. భగత్‌సింగ్ మరణశిక్ష విధించాక ఆగ్రహంతో బొంబాయి వెళ్లి బ్రిటిష్ గవర్నర్‌ను చంపాలనుకుంది. అయితే గవర్నర్ దొరకలేదు. మరో బ్రిటిష్ అధికారి మీద స్వయంగా గుళ్ల వర్షం కురిపించి పగ చల్లార్చుకుంది. భగత్ సింగ్ ఉరి (1931 మార్చి 23) తర్వాత తన వాళ్లంటూ ఎవరూ లేకపోవడం, పోలీసుల వెతుకులాట ఎక్కువ కావడంతో తనే వెళ్లి లొంగిపోయింది. మూడేళ్ల జైలు శిక్ష అనంతరం మొదట లక్నో ఆ తర్వాత ఘజియాబాద్‌లో పెద్దగా పబ్లిక్‌లో ఉండటానికి ఇష్టపడక స్కూల్ నడుపుతూ 1999లో తన 92వ ఏట మరణించిందా గొప్ప దేశభక్తురాలు, భారత తొలి సాయుధ పోరాట సమరయోధురాలు దుర్గాభాభీ.

ఇది సైనికుల సంగ్రామం

- ఇంటికొకరుగా ఆర్మీ జవాన్లు
- నాటి పీపుల్స్‌వార్ ఖిల్లా నుంచి నేడు దేశరక్షణకు సరిహద్దుల్లో యువకులు

ఒక్కో ఊరికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. అలా ఈ ఊరికి ఉన్న ప్రత్యేకత 'దేశభక్తి'. దేశాన్ని కాపాడాలనే ధ్యేయంతో ఊరి యువకులు సైన్యం బాట పట్టారు. ఒకే ఊరి నుంచి ఇంటికి ఒక్కరు చొప్పున సుమారుగా 92 మందికిపైగా యువకులు సైన్యంలో తమ సేవలను అందిస్తున్నారు. ఫలితంగా ఒకప్పుడు పీపుల్స్‌వార్ ఖిల్లాగా ఉన్న ఆ ఊరిని ఇప్పుడు ఆర్మీ జవాన్ల పుట్టినిల్లుగా పిలుచుకుంటున్నారు. ఆ ఊరు సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామం. ఆ ఊరి ముచ్చట్లలోకి వెళదామా?

సుమారు 40 ఏళ్ల క్రితం కట్కూర్ గ్రామానికి చెందిన జేరిపోతుల డేనియల్ మిలిటరీలో జవాన్‌గా చేరాడు. ఆయన స్ఫూర్తితో గ్రామంలోని యువకులు సైన్యం బాటపట్టారు. ఇలా ఒకరిని చూసి మరొకరు ఆర్మీలో చేరారు. జవాన్ స్థాయి నుంచి లాన్స్‌నాయక్, నాయక్, హవల్దార్, నాయక్ సుబేదార్ స్థాయి వరకు వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. ఇలా గ్రామానికి చెందిన వారు ప్రస్తుతం 92 మంది ఆర్మీలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. దాంతో జిల్లాలో కట్కూరు గ్రామం అంటే ఆర్మీజవాన్‌ల గ్రామంగా గుర్తింపు పొందింది. ఈ గ్రామంలో 1,014 కుటుంబాలుండగా జనాభా సుమారుగా 3,045 ఉన్నారు. అందులో మొత్తం గ్రామంలో 175 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉంటారు. వీరిలో కొందరు ఇతర ఉద్యోగాలు చేస్తుండగా, మరికొందరు గ్రామంలో వ్యవసాయం చేసుకుంటున్నారు.

– **మాలోతు శ్రీనివాస్,** సాక్షి, అక్కన్నపేట

దేశసేవ ఇష్టం...



దేశసేవ అంటే నాకు చాలా ఇష్టం. అందుకే 1998లో భారతసైన్యంలో చేరాను. మద్రాస్ ఇంజినీరింగ్ గ్రూప్ బెంగళూర్‌లో ట్రైనింగ్ చేశాను. కార్గిల్ యుద్ధంలో కూడా పాల్గొన్నాను. కాశ్మీర్‌లో రాష్ట్రీయ విభాగంలో సేవలు అందించి అనేక టెర్రరిస్ట్ ఆపరేషన్లలో పాల్గొన్నాను. కాశ్మీర్ సేవలను గుర్తించి నాకు సుబేదార్ మేజర్‌గా ప్రమోషన్ ఇచ్చారు.

– **పంజా సదయ్య,** సుబేదార్

గర్వపడుతున్నా...



దేశరక్షణ కోసం సైన్యంలో పని చేస్తున్నందుకు గర్వపడుతున్నాను. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా దేశం కోసం పని చేయడం ఆనందంగా ఉంది.

– **కొయ్యడ శ్రీనివాస్,** ఆర్మీ జవాన్

పోస్టల్ స్టాంపులు

యుద్ధం ముద్రలు

మహిళలు ఇల్లు విడిచి బయట అడుగు పెడితే వింతగా చూసే కాలంలో సాహసమే వెన్నెముకగా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు ఎంతోమంది మహిళలు. వారి త్యాగాల వెలుగు చరిత్రకే పరిమితమైనది కాదు, వర్తమానంలోనూ స్ఫూర్తిని ఇస్తుంటుంది. ఎంతోమంది మహిళా స్వాతంత్ర్య సమరయోధుల పోస్టల్ స్టాంప్స్ విడుదల అయ్యాయి. ఈ చిన్న స్టాంప్‌లు వారి త్యాగాలు, పోరాట పటిమను ప్రతిఫలిస్తాయి. పోస్టల్ స్టాంప్స్‌పై మెరిసిన కొందరు మహిళా స్వాతంత్ర్య సమరయోధుల గురించి...

రుక్మిణీ లక్ష్మీపతి



ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని మధురైలో పుట్టింది రుక్మిణీ. గాంధీజీ 'హరిజన సంక్షేమ నిధి' కోసం తన బంగారు నగలన్నీ విరాళంగా ఇచ్చేసింది. సహాయ నిరాకరణోద్యమం, విదేశీ వస్తు బహిష్కరణోద్యమంలో చురుగ్గా పాల్గొంది. ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించింది. ఉప్పు సత్యాగ్రహం సందర్భంగా అరెస్టయి జైలు శిక్ష అనుభవించిన తొలి మహిళగా చరిత్రలో నిలిచింది.

సుభద్రా జోషి



గాంధీజీ ఉపన్యాసాలతో ప్రభావితం అయిన సుభద్రా జోషి విద్యార్థిగా ఉన్న రోజుల్లోనే క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొంది. 'హమారా సంగ్రామ్' పత్రికకు ఎడిటర్‌గా పని చేసింది. సుభద్రను అరెస్ట్ చేసి లాహోర్ సెంట్రల్ జైల్‌కు తరలించారు. విడుదలయ్యాక మళ్లీ ఉద్యమంలో భాగం అయింది. సుభద్ర అంకితభావాన్ని నెహ్రూ ప్రశంసించారు.

రాణి మా గైడిన్లియు



బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా మొదలైన 'హెరాక' ఉద్యమంలో పదమూడు సంవత్సరాల వయసులోనే పాల్గొంది రాణి మా. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన ఆదివాసి మహిళగా చరిత్రకెక్కింది. 'హెరాక' ఉద్యమంతో పాటు ఎదుగుతూ వచ్చిన రాణి మా ప్రముఖ రాజకీయ నాయకురాలిగా, ఆధ్యాత్మిక గురువుగా ప్రఖ్యాతి పొందింది.

బేగం హజ్రత్ మహల్



తొలి తరం మహిళా స్వాతంత్ర్య సమరయోధురాలు బేగం హజ్రత్ మహల్. బేగం హజ్రత్ ఇతర సంస్థానాధీశులతో కలిసి బ్రిటిష్ వారితో యుద్ధం చేసింది. లక్నో సమీపంలో జరిగిన యుద్ధంలో బ్రిటిష్ వారిని ఓడించింది. ఆ తరువాత కాలంలో మాత్రం ఓటమికి గురైంది. బ్రిటిష్ వారికి చిక్కకుండా అడవుల్లో తలదాచుకొని పోరాడేది.

కమలానెహ్రూ



జవహర్‌లాల్ నెహ్రూ సతీమణి కమలా నెహ్రూ మహిళా సాధికారత కోసం గళం విప్పిన యోధురాలు. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా అరెస్టై జైలుకు వెళ్లింది. 'దేశ సేవిక' సంఘాలను ఏర్పాటు చేసి ఎంతోమంది మహిళలు స్వాతంత్ర్య ఉద్యమంలో భాగం అయ్యేలా చేసింది.

సుభద్రాకుమారి చౌహాన్



సుభద్రాకుమారి చౌహాన్ కవయిత్రి, స్వాతంత్ర్య సమరయోధురాలు. సహాయ నిరాకరణ ఉద్యమంలో చేరిన తరువాత నాగపూర్ నుంచి అరెస్ట్ అయిన మొట్టమొదటి మహిళా సత్యాగ్రహిగా చరిత్రలో నిలిచింది. మహిళలపై వివక్షతకు వ్యతిరేకంగా పోరాడింది. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా ఎన్నో త్యాగాలు చేసింది.

అరుణా అసఫ్ అలి



భర్త అసఫ్ అలీతో పాటు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంది అరుణ. ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని అరెస్ట్ అయింది. కాంగ్రెస్‌పార్టీ క్విట్ ఇండియా తీర్మానం చేసిన తరువాత బ్రిటిష్ వారు విరుచుకుపడ్డారు. ప్రముఖ నాయకులను అరెస్ట్ చేశారు. ఆ క్లిష్ట సమయంలో అరుణా అసఫ్ అలి కార్యకర్తలకు అండగా ఉంది. బొంబాయి గొవాలియా ట్యాంక్ మైదానంలో కాంగ్రెస్ జెండాను ఎగరేసి క్విట్ ఇండియా ఉద్యమం ఊపందుకునేలా చేసింది.

దుర్గాబాయి దేశ్‌ముఖ్



దుర్గాబాయి దేశ్‌ముఖ్ సాహసవంతురాలైన సామాజిక కార్యకర్త, చిన్నతనం నుంచే మహిళల హక్కుల కోసం పోరాడింది. మహాత్మా గాంధీ నుంచి స్ఫూర్తి పొంది స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంది. గాంధీజీ ప్రభావంతో దుర్గాబాయి మాత్రమే కాదు ఆమె కుటుంబం మొత్తం అన్ని రకాల పాశ్చాత్య దుస్తులను విడిచిపెట్టి, ఖాదీని మాత్రమే ధరించేవారు. మద్రాస్‌లో ఉప్పు సత్యాగ్రహ ఉద్యమానికి నాయకత్వం వహించింది.

రాజ్‌కుమారీ అమృత్ కౌర్



రాజ్‌కుమారీ అమృత్ కౌర్ సామాజిక కార్యకర్త, స్వాతంత్ర్య సమరయోధురాలు. గాంధీజీ కార్యదర్శిగా పని చేసిన ఆమె దండి మార్చ్‌లాంటి ఎన్నో జాతీయ ఉద్యమాలలో చురుకుగా పాల్గొంది. క్విట్ ఇండియా ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన రాజ్‌కుమారి ఇరవై నెలల పాటు జైల్లో గడపాల్సి వచ్చింది. రాచరిక కుటుంబంలో పుట్టినప్పటికీ మహాత్ముడి ఆశ్రమంలో సాధారణ జీవితాన్ని గడిపింది.

మన(సు)లో మాట



మా బాబు ఒకచోట కుదురుగా ఉండటం లేదు...

మా బాబు వయసు 5 సంవత్సరాలు. ఒకచోట నిలకడగా ఉండకుండా, ఎప్పుడూ అటూ ఇటూ తిరుగుతూ ఉంటాడు. ఇంట్లో, స్కూల్లో బయటా కూడా ఇలాగే చేస్తుంటాడు. బయట ఫంక్షన్లకు తీసుకెళితే తనను పట్టుకోవడం, తన చుట్టూ తిరగడంతోటే సరిపోతుంది. అందువల్ల ఈ మధ్య బయటకు వెళ్లడం కూడా తగ్గించేశాం. వాళ్ల నానమ్మేమో, ఇది పిల్లల్లో మామూలే అంటుంది. ఈ మధ్య వాళ్ల స్కూల్ టీచర్ మమ్మల్ని పిలిచి, మా బాబు మీద అనేక కంప్లయింట్లు చెప్పింది. మాకు చాలా ఆందోళనగా ఉంది.

– కె. మాధవి, సికింద్రాబాద్


పిల్లల మెదడులో ఉండే సెల్ఫ్ కంట్రోల్ విభాగం లోని లోపాల వల్ల, వారసత్వ లక్షణాల రీత్యా, కొందరు పిల్లలకు మీరు చెప్పిన లక్షణాలు రావచ్చు. దీనిని హైపర్ యాక్టివిటీ లేదా ఏడీహెచ్‌డీ అంటారు. నిలకడ లేకపోవడం, చదువు మీద ఏకాగ్రత లేకపోవడం, వస్తువులు విసిరేయడం, సహనం లేకపోవడం, ఎప్పుడూ అటూ ఇటూ తిరుగుతూ ఉండటం, స్కూల్‌లో వస్తువులు మరచిపోవడం, ఈ సమస్య ముఖ్య లక్షణాలు. వీరికి తెలివితేటలు బాగానే ఉన్నప్పటికీ, ఏకాగ్రత లోపించడం వల్ల చదువులో వెనకబడతారు. ఇలాంటి వారిని ఎంత చిన్నవయసులో గుర్తించి, సరియైన చికిత్స చేయిస్తే అంత తొందరగా దీంట్లోంచి బయట పడతారు. ఆక్యుపేషనల్ థెరపీ, బిహేవియర్ థెరపీ, అవసరమైతే కొద్ది మోతాదులో కొన్ని మందులు వాడటం ద్వారా వీరిని పూర్తిగా బాగు చెయ్యచ్చు. పేరెంట్స్, టీచర్లు ఇలాంటి వారిని త్వరగా గుర్తించగలిగితే తొందరగా బాగుపడతారు. మైకేల్ ఫిలిప్స్ అనే స్విమ్మర్ ఈ సమస్యతో బాధపడుతూ చికిత్స తీసుకుని బాగుపడి, ఒలింపిక్స్‌లో 20కి పైగా స్వర్ణ పతకాలు సాధించాడు. చైల్డ్ సైకియాట్రిస్ట్‌ల సూచనలు తీసుకోవడం, పాటించడం మేలు చేస్తుంది.



– **డా. ఇండ్ల విశాల్ రెడ్డి**
సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

హెల్దీ డైట్

సగ్గుబియ్యం పొంగనాలు



కావలసినవి: సగ్గుబియ్యం – అర కప్పు (గంట సేపు నానబెట్టాలి); పనీర్ తురుము – 75 గ్రాములు; వేరుశనగపప్పుల పొడి– 3 టేబుల్ స్పూన్‌లు; క్యారట్ తురుము – 3 టేబుల్ స్పూన్‌లు ; బంగాళదుంప – 1 (ఉడికించి తొక్క తీసి చిదమాలి); జీలకర్ర పొడి– టీ స్పూన్; ధనియాల పొడి– టీ స్పూన్; మిరప్పొడి– టీ స్పూన్; ఉప్పు– అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; క్యాబేజ్ తరుగు – ముప్పావు కప్పు; క్యాప్సికమ్ ముక్కలు – అర కప్పు (రెడ్, గ్రీన్ క్యాప్సికమ్); చీజ్ తురుము – 50 గ్రాములు (12 భాగాలు చేసుకోవాలి); నూనె – టీ స్పూన్.



డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

తయారీ: • ఒక పాత్రలో క్యాబేజ్ తురుము, క్యాప్సికమ్ ముక్కలు వేసి ఐదు నిమిషాల సేపు పక్కన ఉంచాలి. ఆ తర్వాత ఇందులో నూనె, చీజ్ మినహా మిగిలినవన్నీ వేసి బాగా కలిపి పన్నెండు భాగాలుగా చేయాలి. ఒక్కో భాగంలో చీజ్ స్టఫ్ చేస్తూ గోళీలాగా చేయాలి • గుంత పొంగనాల పెనం వేడి చేసి ఒక్కో గుంతలో ఒక్కో చుక్క నూనె రుద్ది పొంగనాన్ని పెట్టి మీడియం మంట మీద కాలనివ్వాలి. ఒకవైపు కాలిన తర్వాత రెండోవైపు కాల్చాలి.

పోషకాలు: (ఒక్కో పొంగనంలో)...
• కేలరీలు 63; • ప్రొటీన్ – 2.5 – 3 గ్రాములు; • కార్బోహైడ్రేట్లు – 8–9 గ్రాములు; • ఫ్యాట్ – 2–3 గ్రాములు; • ఫైబర్– గ్రాము; క్యాల్షియం – 40 –50 గ్రాములు.

అరుదైన ఆహ్వానం

12 ఏళ్లు... 15 లైబ్రరీలు

ఈ ఏడాది స్వాతంత్ర్య వేడుకలకు ప్రత్యేక ఆహ్వానం అందుకున్న ఇరవై మందిలో విద్యార్థులు ఆరుగురు. వారిలో అమ్మాయి ఒకే ఒక్కరు. ఆ సరస్వతి పుత్రిక పేరు ఆకర్షణ. లైబ్రరీలు స్థాపిస్తూ సాహిత్యాన్ని సామాన్యులకు దగ్గర చేస్తున్న ఆమె అక్షరసేవకు జాతీయ స్థాయిలో అందిన గుర్తింపు ఇది.

''హైదరాబాద్ హెడ్ పోస్ట్ ఆఫీస్ పోస్ట్‌మాస్టర్ నుంచి 12వ తేదీన నాన్నకు ఫోన్ వచ్చింది. స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా 15వ తేదీన ఢిల్లీలో జరిగే వేడుకలకు హాజరు కావలసిందిగా మీ అమ్మాయి ఆకర్షణకు ఆహ్వానం వచ్చిందని చెబుతూ అభినందనలు తెలియచేశారు'' అంటూ తాను లైబ్రరీ వ్యవస్థాపకురాలిగా మారిన వివరాలను సాక్షి ఫ్యామిలీతో పంచుకున్నారు ఆకర్షణ సతీష్.

కోవిడ్ వచ్చినప్పుడు

''హైదరాబాద్‌లో స్థిరపడిన తమిళ కుటుంబం మాది. నాన్న సతీశ్ క్యాన్సర్ ఎక్విప్‌మెంట్ తయారీ కంపెనీ ఉద్యోగి. నేను హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఎనిమిదవ తరగతి చదువుతున్నాను. పుస్తక పఠనం నా హాబీ కావడంతో వెయ్యికి పైగా పుస్తకాలతో ఇంట్లోనే నాకు సొంత లైబ్రరీ ఉంది. ఇతరుల కోసం లైబ్రరీ స్థాపించాలనే ఆలోచన కోవిడ్ సమయంలో వచ్చింది.

తొలి లైబ్రరీ క్యాన్సర్ హాస్పిటల్‌లో

నాన్న ఉద్యోగరీత్యా క్యాన్సర్ హాస్పిటళ్లకు టచ్‌లో ఉంటారు. కోవిడ్ సమయంలో ఎమ్ఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ వాళ్లు 'కోవిడ్ కారణంగా వంటవాళ్లు డ్యూటీకి రావడం లేదు. పేషెంట్‌లకు ఆహారం అందించడానికి ప్రత్యామ్నాయ ప్రయత్నాలు చేసి పెట్టవలసింది'గా కోరడంతో నాన్న వాళ్ల కోసం రోజూ భోజనం వండించి తీసుకెళ్లి ఇచ్చేవారు. నాకు స్కూల్ లేకపోవడంతో రోజూ నాన్నతోపాటు హాస్పిటల్‌కి వెళ్లేదాన్ని. అక్కడ ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న పేషెంట్‌లలో నా ఏజ్ గ్రూప్ వాళ్లతో స్నేహం ఏర్పడింది. వాళ్లు కొంతమంది చదువుకోవడానికి పుస్తకాలు తెచ్చిపెట్టమని అడిగారు. రోజూ నా పుస్తకాలు కొన్ని తీసుకెళ్లి ఇస్తూ ఉన్నప్పుడు హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ జయలత గారు... 'హాస్పిటల్‌కి చికిత్స కోసం ఎప్పుడూ కొత్తవాళ్లు వస్తుంటారు. హాస్పిటల్‌లోనే లైబ్రరీ ఉంటే బావుంటుంది' అన్నారు. వారి ఆలోచనే నా లైబ్రరీ ఉద్యమానికి నాంది. నా పుస్తకాలతోపాటు మా స్కూల్, అపార్ట్‌మెంట్ స్నేహితుల నుంచి సేకరించిన వెయ్యికి పైగా పుస్తకాలతో తొలి లైబ్రరీ అలా మొదలైంది. ఇప్పటికి 9,836 పుస్తకాలతో 15 లైబ్రరీలు ఏర్పాటు చేయగలిగాను.



• సికింద్రాబాద్ రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతితో...

పదకొండు వేల పుస్తకాలు

నాలుగేళ్లలో పదకొండు వేల పుస్తకాలు సేకరించాను. అందులో రెండు వేల పుస్తకాలు ప్రధాని నరేంద్రమోదీగారిచ్చారు. ఈ ఏడాది మార్చి 18న కోయంబత్తూరులో ఆయనను కలిసే అవకాశం వచ్చింది. ఆ సందర్భంగా ఆయన 25 లైబ్రరీలు స్థాపించమని, 25 లైబ్రరీ స్థాపనకు స్వయంగా హాజరవుతానని చెప్పారు. భారత రాష్ట్రపతి గత ఏడాది శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కి వచ్చినప్పుడు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో కలిశాను. అప్పుడామె 'ప్రజల్లో రీడింగ్ హ్యాబిట్ తగ్గుతోంది, పుస్తక పఠనాన్ని ప్రోత్సహించడానికి దోహదం చేస్తున్న ఈ ప్రయత్నాన్ని కొనసాగించ'మని చెప్పి ఆమే స్వయంగా 74 పుస్తకాలిచ్చారు. ఈ ఏడాది ఢిల్లీ, కర్తవ్య పథ్‌లో జరిగిన 75వ రిపబ్లిక్ డే ఉత్సవాలకు ప్రభుత్వ ప్రత్యేక ఆహ్వానం మేరకు హాజరయ్యాను. ఇదే ఏడాది స్వాతంత్ర్యదినోత్సవం వేడుకలకు కూడా హాజరయ్యే అవకాశం కలగడం సంతోషంగా ఉంది'' అంటూ 25 లైబ్రరీల లక్ష్యాన్ని పూర్తి చేస్తానని చెప్పింది ఆకర్షణ సతీశ్.

– **వాకా మంజులారెడ్డి,** సాక్షి ఫీచర్స్ ప్రతినిధి